క్లుప్తంగా

మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

శాస్త్రిపురం: సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్‌ల పరిధిలోని కాలనీలు, బస్తీలలో అధ్వాన స్థితికి చేరిన మ్యాన్‌హోళ్లకు జీహెచ్‌ఎంసీ సిబ్బంది మరమ్మతులు ప్రారంభించారు. మహ్మద్‌నగర్, ఎంఎం పహాడీ, మీరాలం చెరవు ప్రాంతాలలో నెలల క్రితం మ్యాన్‌హోల్‌లు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. దీంతో చెత్తాచెదారం, మట్టి మ్యాన్‌హోల్‌లో చేరి మురుగునీరు రోడ్లపై పారుతోంది. స్థానికులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన అధికారులు ఎట్టకేలకు వాటికి రమమ్మతులు చేయించారు.

ఆర్థిక వ్యవహారాల్లో అవగాహన అవసరం



శంషాబాద్‌: ఆర్థిక వ్యవహారాల్లో స్పష్టమైన అవగాహన పెంచుకోవడం ఎంతో అవసరమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు సూచించారు. వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కళాశాలలో ఫైనాన్షియల్ అవేర్‌నెస్ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... తక్కువ పెట్టుబడులతో ఎలా లాభాలు ఆర్జించాలి.. అనవర వ్యయాలతో కలిగే నష్టాలు తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భానుప్రకాష్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి, వాణిజ్యశాస్త్ర అ.ధ్యాపకులు రోజా, సుధాకర్ పాల్గొన్నారు.

ర్యాలీలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

రాజేంద్రనగర్‌: మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 14న నిర్వహించనున్న ర్యాలీలను ఆనందోత్సాహాల మధ్య ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని రాజేంద్రనగర్ డివిజన్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ... ర్యాలీలు, సమావేశాలు, సభల నిర్వహణపై స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో, ఎస్‌ఐలు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

అక్రమంగా ఏర్పాటు చేసిన డబ్బా తొలగించాలని ఫిర్యాదు

రాజేంద్రనగర్‌: శివరాంపల్లి ప్రధాన రహదారిపై ఏర్పాటు చేస్తున్న భారీ డబ్బాను తొలగించాలని స్థానికులు జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్‌తో పాటు టౌన్ ప్లానింగ్ అధికారికి బుధవారం ఫిర్యాదు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తూ ఏర్పాటు చేస్తున్న ఈ డబ్బా కారణంగా రానున్న రోజుల్లో ఇబ్బందులు ఏర్పడుతాయని ఆరోపించారు. స్థానిక నాయకుడు జంగయ్య గౌడ్ ఆధ్వర్యంలో పలువురు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శివరాంపల్లి ప్రధాన రహదారిపై భారీ ఇనుప డబ్బాను తీసుకొచ్చి ఏర్పాటు చేశారన్నారు. ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేస్తున్న ఈ డబ్బా కారణంగా ఇబ్బందులు ఏర్పడతాయన్నారు.

హెచ్‌సీయూలో ఎన్నికలకు ఏర్పాట్లు

రాయదుర్గం: హెచ్‌సీయూలో విద్యార్థి సంఘం ఎన్నికల నిర్వహణ నోటిఫికేషన్‌ను బుధవారం జారీ చేశారు. 2025–26వ విద్యా సంవత్సరానికి విద్యార్థి సంఘం ఎన్నికలను నిర్వహించాలని నిర్ణయించారు. ఈ ఎన్నికలకు నామినేషన్లను దాఖలు చేయడానికి గురు, శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంట వరకు అవకాశం కల్పిస్తారు. నామినేషన్ల పరిశీలనను కూడా శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు శనివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అవకాశం కల్పించారు. పోటీలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాను శనివారం ఉదయం 10 గంటలకు ప్రకటిస్తారు. ఎన్నికల ప్రచారాన్ని ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించుకోవడానికి అవకాశం కల్పించారు.

‘స్వచ్ఛ’ంద పునరుద్ధరణతో...

చెరువులకు పూర్వవైభవం!

‘ఈఎఫ్‌ఐ’ ఎన్‌జీఓ సంస్థ ఆధ్వర్యంలో పనులు

- కట్టలు బలోపేతం
- నీటి నిల్వ సామర్థ్యం పెంపు
- నిండుకుండలను తలపిస్తున్న చెరువులు



నల్ల చెరువులో చేపట్టిన పునరుద్ధరణ పనులు

శంషాబాద్ రూరల్‌: ఒకప్పుడు సాగు, తాగు నీటి అవసరాలు తీర్చిన చెరువులు, కుంటల పరిరక్షణ అంతంతమాత్రంగానే ఉంది. రియల్ ఎస్టేట్ పుణ్యమా అంటూ కొన్ని చోట్ల నీటి వనరులు కనమరుగవుతున్నాయి. ఈ నేపథ్యంలో వాటి పరిరక్షణ కోసం ‘ఈఎఫ్‌ఐ’ అనే ఎన్‌జీఓ సంస్థ ముందుకొచ్చింది.. ఎన్విరాన్‌మెంటలిస్ట్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా(ఈఎఫ్‌ఐ) సంస్థ మండలంలోని రెండు చెరువుల పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టింది. దీంతో వీటికి పూర్వ వైభవం రానుంది.

➡ మదన్‌పల్లి శివారులో శ్రీశనైశ్చర దేవాలయం సమీపంలోని నక్కల కుంట, ముచ్చింతల్ శివారులో సమతామూర్తి కేంద్రం సమీపంలో ఉన్న నల్ల చెరువు పునరుద్ధరణ పనులు చేపట్టారు.

హెచ్‌ఎండీఏ అనుమతులతో...

➡ ఈ రెండు చెరువుల పునరుద్ధరణకు నిర్వాహకులు హెచ్‌ఎండీఏ నుంచి అనుమతులు తీసుకున్నారు. సుమారు రూ. 50 లక్షల అంచనా వ్యయంతో ఈ పనులు మొదలుపెట్టారు. వీటిలో పిచ్చి మొక్కల తొలగింపుతో పనులను ప్రారంభించారు.

➡ నీటి నిల్వ సామర్థ్యం పెరిగేలా పూడిక తీసి లోతు పెంచారు. చెరువు కట్టలను బలోపేతం చేశారు. ఇందు కోసం కట్టల ఎత్తును పెంచి వెడల్పు చేశారు.

పక్షులకు ఆవాసంగా...

చెరువుల్లో పక్షులు ఆవాసులు ఏర్పాటు చేసుకోవడానికి అనువైన ఏర్పాట్లు చేస్తున్నారు. చెరువు మధ్యలో నీళ్లలో పక్షులు గూడు కట్టేందుకు ద్వీపాలను రూపొందించారు. తర్వాత పెర్కోలేషన్ ట్రెంచ్, రీచార్జ్ బావులను నిర్మించారు. దీంతో పాటు చెరువులకు రోడ్డు పక్కన ఇనుప కంచె ఏర్పాటు చేశారు.

60 శాతం పనులు పూర్తి...

చెరువుల పునరుద్ధరణ పనులు దాదాపు 60 శాతం పూర్తి కావచ్చినట్లు సంస్థ వ్యవస్థాపకుడు అరుణ్ కృష్ణమూర్తి తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఇప్పటికే చెరువులు నిండు కుండలా మారాయి. చెరువుల్లో పూడికతీయడంతో నీటి నిల్వ సామర్థ్యం పెరిగింది. దీంతో భూగర్భ జలాలు పెరగడానికి దోహదపడుతుంది. స్థానికులు గణేశ్ నిమజ్జనానికి మొదటి సారి ఈ చెరువులను వినియోగించుకున్నారు.

ఆహ్లాదానికి అనువుగా...

పునరుద్ధరణ పూర్తయితే.. భవిష్యతులో వీటి సుందరీకరణ చేపడితే ఆహ్లాదానికి అనువుగా మారుతాయని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు చెరువులు కూడా ఆధ్యాత్మిక కేంద్రాలకు దగ్గరగా ఉండటంతో అక్కడకు వచ్చే భక్తులు ఆహ్లాదాన్ని ఆస్వాదించే అవకాశాలు ఉంటాయనడం నిర్వివాదాంశం.

పొంగి ప్రవహిస్తున్న వాగులు

శంషాబాద్ రూరల్‌: శంషాబాద్ మండల పరిధిలోని ఈసీ, ఎంటేరు వాగులో మరోసారి పొంగి పొర్లాయి. ఎగువ ప్రాంతంలో మంగళవారం రాత్రి కురిసిన వానకు వాగుల్లో వరద నీరు పారింది. ఈసీ వాగు పరిసర ప్రాంతాల్లోని పంట పొలాలను వరద ముంచెత్తింది. బుధవారం సైతం మండల పరిధిలో మోస్తారు వర్షం కురిసింది.



ఈసీ వాగులో పొంగి ప్రవహిస్తున్న వరదనీరు



పనులు చేపట్టిన తర్వాత నక్కల కుంట



పునరుద్ధరణ పనులతో నిండు కుండలా నల్ల చెరువు



నల్ల చెరువులో పక్షుల ఆవాసం కోసం ఏర్పాటు చేసిన ద్వీపాలు

అధికారుల మ్యూజికల్ చైర్!



రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయం

- రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో అరకొర వసతులు
- ముగ్గురు అధికారుల మధ్య ‘చాంబర్ వివాదం’
- ఒకే చాంబర్‌లో కూర్చొని విధుల నిర్వహణ
- తరచూ వారి మధ్య మాటల యుద్ధం

రాజేంద్రనగర్‌: జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలోని రెవెన్యూ సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌లకు సౌకర్యాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఒకే చాంబర్ ఉండటం... ముగ్గురు అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లుగా విధులు నిర్వహిస్తుండటంతో చాంబర్ విషయమై రోజూ అధికారుల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. సర్కిల్ కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో జయప్రకాశ్ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించేవారు. ఆయనకు సెక్షన్‌లో ప్రత్యేక చాంబర్ ఉంది. మూడు నెలల క్రితం సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన నిర్మలను రాజేంద్రనగర్‌కు బదిలీ చేశారు. రెవెన్యూ విభాగంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌గా ఆమె విధుల్లోకి చేరింది. ఇద్దరూ ఒకే చాంబర్‌లో విధులు నిర్వహించేవారు. ఇదిలా ఉండగా ఖైరతాబాద్ సర్కిల్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పని చేసిన రమేశ్ కుమార్‌కు అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి కల్పించి రాజేంద్రనగర్‌కు బదిలీ చేశారు. దీంతో ముగ్గురు అధికారులు ఒకే చాంబర్‌లో కూర్చొని విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. చాంబర్‌లు లేకపోవడంతో ఈ ముగ్గురి మధ్య తరుచూ ఘర్షణ జరుగుతుందని సమాచారం. జీహెచ్‌ఎంసీలో అతి ముఖ్యమైన రెవెన్యూ విభాగంలో బిల్లు కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లకు సైతం సరైన వసతులు లేవు. ఏ ఒక్కరికీ ఇక్కడ కూర్చొనేందుకు కుర్చీలు సైతం లేవు. చాంబర్ గొడవ పెద్దది కాక ముందే ఉన్నతాధికారులు స్పందించి వసతులు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తెల్లవారు జాము వరకు సోదాలు

టీపీఓను రిమాండ్‌కు తరలించిన ఏసీబీ

మణికొండ: నార్సింగి మున్సిపాలిటి కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ అధికారిగా పనిచేస్తున్న మణిహారికను ఏసీబీ అధికారులు మంగళవారం రూ. 4 లక్షలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న విషయం తెలిసిందే. అయితే నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో ఒక టీము, అలకాపూర్ టౌన్‌షిప్‌లోని ఆమె నివాసంలో మరో టీము బుధవారం తెల్లవారు జామున 3 గంటల వరకు సోదాలు నిర్వహించారు. ఆమె ఇప్పటి వరకు ఇచ్చిన నిర్మాణ అనుమతుల, జారీ చేసిన ఎన్‌ఓసీలు, ఎల్‌ఆర్‌ఎస్ క్లియరెన్స్‌ల ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించినట్టు తెలిసింది. ఇంట్లోను బంగారం, డబ్బు, విలువైన పత్రాల కొరకు సోదాలు చేసినట్టు సమాచారం. మంగళవారం లభించిన రూ. 4 లక్షలకు అదనంగా ఏమైనా దొరికాయా.. అనే విషయాన్ని ఏసీబీ అధికారులు వెల్లడించలేదు. బుధవారం ఆమె ఏసీబీ కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్టు తెలిసింది.

ఆత్మహత్యలు ఏ సమస్యనూ పరిష్కరించలేవు

- మనోధైర్యంతో పోరాడితేనే విజేతలవుతాం
- మోర్ట్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్

శంషాబాద్‌: ‘‘మనం ఎదుర్కొంటున్న ఏ సమస్యనూ ఆత్మహత్యలు పరిష్కరించలేవు.. ఒక్క క్షణం ఆలోచించి సముచిత నిర్ణయం తీసుకుని ధైర్యంగా నిలబడితే కచ్చితంగా విజేతలుగా నిలుస్తాము’’ అని మోర్ట్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ మాధవరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక సమస్యలు, అభిమాన నటులు, ఇష్టమైన వ్యక్తులను కోల్పోవడం ఇలా అనేక సంఘటనలకు ఆత్మహత్యలే పరిష్కారం అనుకుంటున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తొందరపాటు చర్యలతో విద్యార్థులు సైతం మార్కుల సాధించలేక ఆత్మహత్యల సంఖ్య కూడా భయాందోళన కలిగిస్తున్నదన్నారు. సమస్యలు జయించిన వారే సమాజంలో అత్యున్నతమైన వ్యక్తులుగా నిలబడుతున్నారని ఆయన స్పష్టం చేశారు. అలాంటప్పుడే ఏ సమస్యకైనా పరిష్కారం లభిస్తుంది అని ప్రిన్సిపాల్ మాధవరెడ్డి సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలి



టీచర్స్‌డేలో పాల్గొన్న మాజీ కౌన్సిలర్‌లు, ఉపాధ్యాయులు

మణికొండ: విద్యార్థులను అన్ని రంగాలలో ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో కృషి చేయాలని మణికొండ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్‌లు కె. రామకృష్ణారెడ్డి, బి.మీనముత్యాలులు అన్నారు. బుధవారం మణికొండ వీకర్ సెక్షన్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉపాధ్యాయుల పనితీరు వలనే పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల రాణింపు ఉంటుందన్నారు. కేవలం ఉద్యోగంలా కాకుండా నవసమాజ నిర్మాణానికి పూర్తి స్థాయిలో కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల, నాయకులు బషీర్, పెంటారెడ్డి, చారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదాయం కోసం.. పచ్చదనంపై వేటు!

- ఏపుగా పెరిగిన మొక్కలు
- నాడు నాటారు.. నేడు తొలగిస్తున్నారు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం



ఖానాపూర్ రోడ్డులో చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

మణికొండ: రోడ్ల పక్కన, మధ్యలో డివైడర్‌లపై మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందిస్తున్నామని ఓ వైపు గొప్పలు చెప్పే అధికారులు అవి నాటుకుని ఏపుగా పెరిగాక తొలగించటంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని గండిపేట చౌరస్తా నుంచి ఖానాపూర్ వరకు రోడ్ల పక్కన, డివైడర్‌లలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి శోభాయమానంగా తయారయ్యాయి. అటుగా రాకపోకలు సాగించే వారు ఎంతో ఆహ్లాదంగా ఉందని కితాబులు ఇచ్చారు. అలాంటి మొక్కలను రోడ్ల మధ్యలో ఏర్పాటు చేస్తున్న సైన్ బోర్డులు కనిపించాలనే ఉద్దేశంతో నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నారని పలువురు పేర్కొన్నారు. ఇప్పటికే వంద కోట్ల ఆదాయం ఉన్న మున్సిపాలిటీలో అదనపు ఆదాయాల కోసం మొక్కలను తొలగించటం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. బహుళ అంతస్తుల భవనాల రాకతో కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న నార్సింగి మున్సిపాలిటీలో వీలైనంత ఎక్కువ పచ్చదనాన్ని పెంచాల్సింది పోయి నాటి, పెరిగిన మొక్కలను తొలగించటంపై జిల్లా కలెక్టర్, మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని వాటిని సంరక్షించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థులు ప్రయోజకులైతేనే సంతోషం

మైలార్‌దేవ్‌పల్లి: ప్రతి విద్యార్థి విద్యాభివృద్ధితోపాటు వారి ఉజ్వల భవిష్యత్‌కు ఉపాధ్యాయులు ఎంతో శ్రమిస్తారని వారి శ్రమకు తగ్గ ప్రతిఫలం దక్కినప్పుడు వారు ఎంతో సంతోషిస్తారని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. మండల విద్యాధికారి శంకర్‌రాథోడ్ అధ్యక్షతన దుర్గా కన్వెన్షన్ హాల్‌లో మండల ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని నేర్చుకోవాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థం అయ్యేలా బోధన చేస్తూ వారి అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేయాలన్నారు. తల్లిదండ్రుల తరువాత గురువే దైవంగా భావించినప్పుడే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కె.హనుమంతరావు, రంగారెడ్డి జిల్లా యుటీఎఫ్ అధ్యక్షుడు గోపాల్‌నాయక్, గెజిటెడ్ హెడ్ మాస్టర్లు సుగుణ, బుక్య శ్రీనునాయక్, ఝాన్సీ, శ్రీలత, చంద్రశేఖర్‌రెడ్డి, హెడ్ మాస్టర్ రవికుమార్, వివిధ ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు, ప్రతినిధులు సుదర్శన్, కె.వెంకటయ్య, మహేశ్వర్, వెంకటప్ప, ఎం.బాలకృష్ణ, రహమాన్, మండల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల సంఘం ప్రతినిధులు ప్రభాకరచారి, శ్రావణ్ కుమార్, ఎస్ఆర్ రజనీకాంత్, మల్లెల శ్రీనివాస్ రెడ్డి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ పోరాటం.. స్ఫూర్తిదాయకం

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్
- వాడవాడలా చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళి



లక్ష్మిగూడలో చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి యువత ఆదర్శం కావాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ శివాజీ చౌక్ వద్ద లక్ష్మిగూడ రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

– బీఆర్‌ఎస్ పార్టీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ సీనియర్ నేతలు వేణు రజక, ఎడ్లకాడి సూర్యం, గుమ్మడి కుమార్, ఉప్పల్ శ్రీను, కొంపల్లి జగదీష్, సునీల్, శేఖర్, శ్రీకాంత్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎడ్లకాడి అనిల్, మహేందర్‌ముదిరాజ్, వెంకటరమణ పాల్గొన్నారు.

హైదర్‌గూడలో...

అత్తాపూర్‌: హైదర్‌గూడలోని ఐలమ్మ విగ్రహానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని కొనియాడారు. అనంతరం రాజేంద్రనగర్ మున్సిపల్ నిధులతో నిర్మించిన నూతన రజక భవనాన్ని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కార్పొరేటర్ సంగీత లాంఛనంగా ప్రారంభించారు.

కోకాపేటలో...

మణికొండ: తెలంగాణ సాయుధ పోరాటంలో తన పోరాట పటిమతో రజాకార్లను వణికించిన చాకలి ఐలమ్మ గొప్ప పోరాట యోధురాలని రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి. జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ కోకాపేటలోని ఆమె విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డితో కలిసి ఆమె వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జి.విజయ్‌బాబు, మాజీ కౌన్సిలర్ జి.శివారెడ్డి, నాయకులు హరిశంకర్, ఆంజనేయులు, యాదగిరి, సురేష్‌బాబు, గణేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బుద్వేల్ చౌరస్తాలో...

రాజేంద్రనగర్‌: బుద్వేల్ చౌరస్తాలో చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రజక సంఘం గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు పెండ్యాల శ్రీధర్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

బండ్లగూడ పరిధిలో...

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు.



శివాజీ చౌక్ వద్ద బీఆర్‌ఎస్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు వెంకటేష్



హైదర్‌గూడలో నివాళులర్పిస్తున్న నేతలు



బుద్వేల్ చౌరస్తాలో...



బండ్లగూడలో కాంగ్రెస్ కార్పొరేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి...



కోకాపేటలో నివాళులర్పిస్తున్న నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

బండ్లగూడ: ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీర్‌మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సంతోష్‌ముదిరాజ్, మాజీ వార్డు సభ్యులు రవికాంత్‌రెడ్డిలు ప్రకాశ్‌గౌడ్‌ను కలిశారు.